క్లుప్తంగా

బహుళ పంటలతో అధిక ప్రయోజనాలు



సి.బెళగల్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

సి.బెళగల్: మండల రైతులు బహుళ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం సి.బెళగల్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, కంది పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏక రకం పంటలు కాకుండా బహుళ పంటలను సాగుచేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని తెలిపారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి పత్తి పంట సంరక్షణపై అవగాహన కల్పించారు.

బదిలీ పశువైద్యుడికి సన్మానం



డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, గొర్రెల కాపర్లు

సి.బెళగల్: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పనిచేస్తూ ఇటీవల పత్తికొండకు బదిలీ అయిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం సన్మానించారు. మండలంలో పనిచేస్తున్న పశువైద్యులు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆయన్ను సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పోలకల్ పశువైద్యుడు రోనాల్డ్‌రిచర్డ్స్, రామకృష్ణ (వీఏ), దస్తగిరి (ఎస్‌ఓ), వీహెచ్‌ఏలు సంధ్య, జాహ్నవి, మహేంద్ర, పశువైద్యశాల సిబ్బంది వెంటకరాముడు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



సిబ్బందిని సన్మానిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ఎక్కడ పనిచేసినా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. బదిలీపై వెళ్తున్న వీఆర్‌ఓలు, సర్వేయర్‌లను మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్‌ఐ రామ్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం జొహరాపురానికి చెందిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. రవిసాయి అనే వ్యక్తి ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ బాలిక వెంటపడుతూ లైంగికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధితురాలి తల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

26న సర్వసభ్య సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ టి.నాగరమణయ్య తెలిపారు. ఈ సొసైటీలో జరిగిన అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ చట్టం సెక్షన్–51 ప్రకారం విచారణ నిర్వహించగా రూ.2.42 కోట్ల మేర నిధులు స్వాహా అయినట్లు తేలింది. నిధుల దుర్వినియోగానికి పాలకవర్గమే కారణమని విచారణలో నిర్ధారణ అయ్యింది. విచారణకు సంబంధించిన నివేదిక సొసైటీకి ముట్టిన 30 రోజుల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆమోదం తీసుకోవాల్సి ఉందని, ఇందులో భాగంగా ఈ నెల 26న ఈ సమావేశం సొసైటీ కార్యాలయంలోనే ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో వెలుగు చూసిన అక్రమాలను సభ్యులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. సొసైటీలోని సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

బాబు పాలనంతా నయవంచనే!

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గడివేములలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'
- సమస్యలను ఏకరవు పెట్టిన స్థానికులు



బాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: చంద్రబాబు పాలనంతా నయవంచనే అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గడివేములలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం ఉన్నా, లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షమేనన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. రూ.వెయ్యి పింఛన్ పెంచి, 5 లక్షల మంది పేదల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. గ్రామాల్లో గత జగనన్న ప్రభుత్వంలో వేసిన రోడ్డు తప్ప కూటమి ప్రభుత్వం ఇంత వరకు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు.

హామీలను అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గడివేముల ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం పడలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచే పుట్టిందని సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బు ఉన్నవారు లేనివారికి సాయం చేయాలని పీ–4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, రూ.లక్షల కోట్లు ఉన్న చంద్రబాబు ఎంతమందిని దత్తత తీసుకోవాలో ప్రజలే ఆలోచించాలన్నారు. టీడీపీ నాయకులు ఇంటి వద్దకు వస్తే మేనిఫెస్టోను అమలు చేసేంత వరకు నిలదీయాలని సూచించారు. ఆడబిడ్డ నిధి, ఉచితబస్సు, అన్నదాత సఖీభవ, నిరుద్యోగభృతి, కరెంటు బిల్లుల తగ్గింపు తదితర చంద్రబాబు హామీల మేనిఫెస్టోను గుర్తుకుతెస్తూ క్యూఆర్ కోడ్‌ను ప్రజల స్మార్ట్‌ఫోన్లలో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల కన్వీనర్ మధుసూదన, మాజీ సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీటీసీలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాస రెడ్డి, సర్పంచ్‌లు రామ్మోహన్‌రెడ్డి, శేఖర్, ఉప సర్పంచ్‌లు బాలచెన్ని, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామిరెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, రఘుమాధవరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, మేఘునాథరెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గని ప్రతాపరెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లయ్య, రమేష్, పరమేశ్వరరెడ్డి సర్వేష్‌రెడ్డి, డాలుస్వామి, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రోజు నుంచి యూరియా దొరక్క అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. జగనన్న హయాంలో కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉండేవన్నారు. గతంలో వివిధ విపత్తులతో నష్టపోయిన రైతులకు వైఎస్సార్‌బీమా కింద ప్రభుత్వమే బీమా చెల్లించి రైతులకు పరిహారం అందించేవాళ్లమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీమా రైతులే చెల్లించాలని అధికారులు రైతులకు చెబుతున్నారన్నారు.

సమస్యలను ఏకరవు పెట్టిన స్థానికులు

సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు కాటసాని ముందు ఏకరువు పెట్టారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని విన్నవించినా అధికార పార్టీ నేతలు చులకనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిదీపాలు వెలగడం లేదని, రోడ్లలో గుంతలు ఏర్పడంతోపాటు వర్షపునీరు నిల్వ ఉండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాటసాని ఎదుట వాపోయారు.

మోసపోయామని ప్రజలకు అర్థమైంది

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, కూటమి పార్టీల అబద్ధపు హామీలకు మోసపోయామని ప్రజలకు అర్థమైందని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ క్యూఆర్ కోడ్ ద్వారా గత ఏడాది కాలంలో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయారో వివరించారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని, మహిళలకు ఉచిత బస్సు అమలు కావడం లేదని ప్రజలు తమ గోడును వెల్లబోసుకున్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



పందిపాడులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాంభూపాల్ రెడ్డి

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



పత్తి పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న శాస్త్రవేత్త రామక్రిష్ణారావు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి పంటకు ప్రధానంగా సోకే గులాబిరంగు పురుగుపై రైతులంతా అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త రామక్రిష్ణారావు సూచించారు. మంగళవారం మండలంలోని కల్లపరి గ్రామంలో ఏఓ రవి ప్రకాష్ రైతులతో కలిసి పత్తి, కంది పంటల సాగుపై ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్త రామక్రిష్ణారావు రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. పత్తి పంట సాగు చేసిన రైతులంతా ప్రతి రోజు పంటను పరిశీలిస్తూ ఉండాలని, రసం పీల్చే పురుగు, దోమగాని కన్పించిన ఎడల వేపనూనెను స్ప్రే చేసుకోవాలని, పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అలాగే గులాబి రంగు పురుగు నివారణ కోసం లింగాకర్షక బుట్టలను ఎకరానికి పది చొప్పున ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మండలంలోని బూడిదపాడు, కె.నాగలాపురం గ్రామాల్లో ఏఓ దస్తగిరి రెడ్డి మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటకు సోకే తెగుళ్లు, గులాబి రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

విద్యుత్ మీటర్ మార్చిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కార్పెంటర్ షాపునకు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేయడంతో వందల్లో వచ్చే బిల్లు ఏకంగా వేలల్లో వచ్చింది. వేలల్లో వచ్చిన బిల్లులను కట్టలేక బాధితుడు నాగేంద్ర ఆచారి పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన విద్యుత్ అధికారులు మంగళవారం కార్పెంటర్ షాపునకు గతంలో బిగించిన స్మార్ట్ మీటర్‌ను తొలగించి మరో మీటర్‌ను ఏర్పాటు చేశారు. అధికంగా కరెంట్ బిల్లులు వస్తున్న మీటర్‌ను సిబ్బంది మార్చడంతో కనీసం ఇకనుంచైనా కరెంట్ బిల్లు తక్కువగా వస్తుందో లేదో చూడాలంటూ నాగేంద్ర ఆచారి పేర్కొన్నారు.



కార్పెంటర్ షాపుకు అధికంగా బిల్లు వస్తున్న స్మార్ట్ మీటర్‌ను మారుస్తున్న సిబ్బంది

హంద్రీనీవా కాలువ పరిశీలన



కృష్ణగిరి వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ఎస్‌ఈ పాండురంగయ్య

కృష్ణగిరి: హంద్రీనీవా కాలువ ద్వారా నీరు నిరంతరాయంగా వెళ్లుతుందని హెచ్‌ఎన్‌ఎస్ ఎస్‌ఈ పాండురంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మల్లెపల్లె, కృష్ణగిరి, కంబాలపాడు, ఆలంకొండ, గుండ్లకొండ ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. అలాగే కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లకు కూడా నీటిని వదిలినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాల వద్ద మోటార్లకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని. అలాగే కాలువ వెంట నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈయన వెంట డీఈ చెన్నయ్య ఉన్నారు.

నగరపాలక ఈఈగా మనోహర్ రెడ్డి

కర్నూలు (టౌన్): ప్రజా సాంకేతిక శాఖ ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. డీఈఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం రాత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జీఓ 697 ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగానే నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జి.మనోహర్ రెడ్డికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు కార్పొరేషన్‌లోనే నియమించారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పి.లీలా క్రిష్ణప్రసాద్‌ను విజయవాడ టిడ్కోకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. అలాగే కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ)లో పనిచేస్తున్న బి.గోపాల క్రిష్ణమూర్తిని ఆదోని మున్సిపాలిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా, అలాగే కుడాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నయాబ్ రసూల్‌ను కుడాలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నియమించారు.

కాలినడకన ఉరుకుందకు పాదయాత్ర



కోడుమూరు నుంచి ఉరుకుందకు భారీగా తరలివెళుతున్న భక్తులు



భక్తులకు అల్పాహారం అందజేస్తున్న దాతలు

కోడుమూరు రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు మంగళవారం కోడుమూరు నుంచి వందలాది మంది భక్తులు ఉరుకుందకు కాలినడకన తరలివెళ్లారు. కోడుమూరు కోటవీధిలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి భక్తులు కాలినడకన తరలివెళ్లగా, ప్రజలు మేళతాళాలతో వారిని ఘనంగా సాగనంపారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో వచ్చే అమవాస్య రోజు ఉరుకుంద ఈరన్నను దర్శించుకునేందుకు భక్తులు కోడుమూరు నుంచి తరలివెళతారు. కాలినడకన వెళ్లే భక్తులకు కొందరు దాతలు ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

కియోస్క్ సేవలకు మంగళం

- ఆర్బీకేలలో మూలకు చేరిన కియోస్క్ మిషన్లు
- ఆర్బీకేలతో పాటు కియోస్క్ సేవలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయ శాఖలో డిజిటల్ ఆధారిత సేవలు నిల్
- అన్నదాతలకు సేవలు దూరం



గార్గేయపురం రైతు సేవా కేంద్రంలో పక్కన పెట్టిన కియోస్క్ యంత్రాలు

కర్నూలు(రూరల్): రైతు సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేసి, అన్నదాతలకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో పాటు సాంకేతిక సమాచారం అందిస్తూ మద్దతుగా నిలిచింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల వ్యవధిలో ఆ సేవలకు గండిపడుతోంది. ప్రస్తుతం ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినా వాటి అసలైన ఉద్దేశం, సేవల స్ఫూర్తికి ప్రభుత్వం దూరంగా వెళ్తోంది. ముఖ్యంగా రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు పనిచేయడం లేదంటూ మూలన పడేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నియోజకవర్గంలో 75 ఆర్బీకేలు

కోడుమూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 75 ఆర్బీకేలు ఉన్నాయి. గూడూరు మండలంలో 12, సి.బెళగల్–16, కోడుమూరు–21, కర్నూలు రూరల్‌లో 26 ఏర్పాటు చేశారు. ఇక్కడ 75 కియోస్క్ మిషన్ల ద్వారా ఎరువుల ధరలు, మార్కెట్ రేట్లు, వాతావరణ సమాచారం వంటి ముఖ్యమైన విషయాలు డిజిటల్‌గా రైతులకు అందేవి. కానీ ఇప్పుడు అవి పనిచేయకపోవడంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సాంకేతిక లోపం సాకుతో నిలిపివేత

కొన్ని కేంద్రాల్లో కియోస్క్‌లు సాంకేతిక కారణాలతో నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మరి కొన్ని కేంద్రాల్లో అయితే ఇంటర్నెట్ లేదుఅనే కారణంతో మూసివేశారు. దీంతో కోట్ల రూపాయల విలువైన పరికరాలు వృథా అయ్యాయి. గత ప్రభుత్వ ముద్ర ఉండకూడదనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

మండలంలోని కొన్ని కియోస్క్‌లు సాంకేతిక సమస్యల వల్ల పనిచేయడం లేదు. త్వరలోనే వాటిని మరమ్మతు చేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం. మధ్యంతరంగా రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ చేసే సేవలను మొబైల్ ఫోన్ల ద్వారా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.
–రూఫస్ రోనాల్డ్, మండల వ్యవసాయాధికారి

ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ తప్పనిసరి

కల్లూరు: మహిళ గ్రీవెన్స్ సెల్‌తో పాటు ప్రతి ఉన్నత విద్యాసంస్థలో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. మంగళవారం దూపాడు సమీపంలోని అశోక మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఎందుకు ఏర్పాటు చేస్తారు, వాటి ఉపయోగాలు ఏంటి అనే విషయాన్ని విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యాసంవత్సరం ఇంట్రడక్షన్ కార్యక్రమంలో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైమ్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలనేది మన చేతుల్లోనే ఉంటుందన్నారు. డీఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, మహిళ పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

25న ఫ్లోర్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లాస్థాయి ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–19 బాలబాలికల విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 70138 86343 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఓ లాడ్జిలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కర్నూలుకు చెందిన మహమ్మద్ ఫరూక్ (31) సోమవారం రాజమహేంద్రవరం వచ్చి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మర్నాడు ఉదయం 11 గంటలకు గడువు అయిపోవడంతో లాడ్జి సిబ్బంది తలుపు కొట్టగా, అతడు ఎంతకూ తెరవలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది మారు తాళం చెవితో తలుపు తీయగా, ఫరూక్ విగత జీవిగా పడిఉన్నాడు. ఈ విషయమై లాడ్జి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా గదిలో పురుగు మందు డబ్బా లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న పార్టీ నాయకులు

సి.బెళగల్: మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా స్టూడెంట్ విభాగం కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన బోయ తిరుమలేష్, తెలుగు దస్తగిరి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా, మహ్మద్ అనీఫ్ మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో మంగళవారం కోట్ల హర్షను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమన్వయంతో పనిచేసి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు సీబీ తులసిరెడ్డి, కోడుమూరు నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు హరూన్ రషీద్, నాయకులు మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, ఎస్ఎం బాషా, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న తదితరులు ఉన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా!



ఈ ఫొటోలో ఉన్నది మురుగు కాలువ అనుకుంటే మీరు పొరపాటే.. గడివేముల మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని రహదారి. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు ఇలా రోడ్డుపై నిలిచి మురుగు కాలువను తలపిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. మురుగునీరు నిల్వ వల్ల వాహనదారులు, పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిపడే అవకాశం ఉందని ఉన్నతాధికారులైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. – గడివేముల